సాక్షి నిర్మల్

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



విత్తన గణపతిం భజే..!

పర్యావరణ హితానికి మహిళా సంఘాల ఆధ్వర్యంలో విత్తన మట్టి గణపతులు తయారు చేశారు. ఐదు రకాల విత్తనాలతో తయారు చేసిన ప్రతిమలను గ్రామాల్లో పంపిణీ చేశారు. 8లో▸



కొత్తగా నలుగురు ఫార్మసిస్టులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఆసుపత్రికి నలుగురు గ్రేడ్‌–2 ఫార్మసిస్టులను ప్రభుత్వం కేటాయించింది. శనివారం సుమలత, సుజాత, కళ్యాణి, విజయకుమార్ డీసీహెచ్ఎస్ దేవేందర్‌రెడ్డికి రిపోర్ట్ చేశారు. గ్రేడ్‌–1 ఫార్మసిస్ట్ ఎస్.శ్రీనివాసచారి పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.4 /23.6

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాలు, తుపాను ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. ఒకటిరెండు చోట్ల మోస్తరు వాన కురుస్తుంది.

న్యూస్‌రీల్

బీటీ రోడ్డు పనులు పరిశీలించిన డీఎఫ్‌వో



బీటీ రోడ్డును పరిశీలిస్తున్న రాంకిషన్‌యాదవ్

దస్తురాబాద్: మండలంలోని మల్లాపూర్ గ్రామ పంచాయతీలోని వెంటాపూర్ గ్రామానికి రూ.4 కోట్లతో నిర్మిస్తున్న నాలుగు కిలోమీటర్లు బీటీ రోడ్డును జిల్లా అటవీ అధికారి రాంకిషన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖ పరిధిలోకి వచ్చే బీటీ రోడ్డుకు అవసరమైనా అనుమతులను పరిశీలించి నివేదికలు ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఆయన వెంట ఎఫ్‌డీవో భవాని శంకర్, ఎఫ్ఆర్‌వో అనిత, డీఆర్‌వో సిద్ధార్థ, ఎఫ్‌బీవో లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

పకడ్బందీగా డిజిటల్ క్రాప్ సర్వే

- డీఏవో అంజిప్రసాద్



డిజిటల్ క్రాప్ సర్వేను పరిశీలిస్తున్న డీఏవో

లోకేశ్వరం: రైతులు ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ అన్నారు. మండలంలోని వాస్తాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో డిజిటల్ క్రాప్ సర్వేను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా డీఏవో మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రతీరోజు డిజిటల్ క్రాప్ సర్వేను మొబైల్ యాప్ ద్వారా వేయాలని సూచించారు. లోకేశ్వరం మండలంలో ఇప్పటి వరకు 3వేల వరకు డిజిటల్ క్రాప్ సర్వే చేశారన్నారు. ఆయన వెంట ఏవో గణేశ్, ఏఈవో భూమేశ్ ఉన్నారు.

జిల్లాస్థాయి బాక్సింగ్ సెలక్షన్స్



జోనల్ స్థాయి బాక్సింగ్‌కు ఎంపికైన క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లాస్థాయి బాక్సింగ్ సెలక్షన్‌ను శనివారం నిర్వహించారు. ఇందులో అండర్ -14 , అండర్‌-17, అండర్‌-19, బాల బాలికల పోటీలలో 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 42 కేజీల విభాగంలో అనన్య, 42-44 కేజీల విభాగంలో జ్యోతి, 44-46 కేజీల విభాగంలో హర్షిణి, 46-48 కేజీల విభాగంలో సౌజన్య, 48-50 కేజీల విభాగంలో వనజ, 50-52 కేజీల విభాగంలో అనసూయ, 54-46 కేజీల విభాగంలో శ్రావణి, 60-66 కేజీల విభాగంలో మధుప్రియ, 63-64 కేజీల విభాగంలో నక్షత్ర, వరుణ్, దీక్షిత్ ,శ్రీనివాస్, బి.శ్రీనివాస్, అరవింద్, ఎండీ.రిదాన్, ఎండి ఇర్ఫాన్, ఎండీ.సమీర్‌లు జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ జనరల్ సెక్రెటరీ రామారావు, పెటా అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ భూమన్న, బాక్సింగ్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు, జనరల్ సెక్రెటరీ బండారి శ్రీధర్, చందుల స్వామి అభినందించారు.

శోభాయాత్రకు పకడ్బందీ చర్యలు



ముధోల్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ

భైంసాటౌన్/ముధోల్: భైంసాలో జరిగే గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. భైంసా పట్టణంలోని పంజేషచౌక్‌లో శోభాయాత్ర మార్గాన్ని, ముధోల్‌లోని గణపతి మండపాలను శనివారం పరిశీలించారు. ముధోల్‌లోని మహాలక్ష్మీ వీధిలోని అఖండ గణపతి వద్ద, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాట్లు, బందోబస్తు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, సీఐలు శ్రీను, వినోద్‌రెడ్డి, ఎస్సై సాయికిరణ్ ఉన్నారు.

నిర్వహణ లోపం.. నిరుద్యోగులకు శాపం

- గ్రూప్‌-1 ప్రిలిమ్స్ మళ్లీ రద్దుతో అభ్యర్థుల్లో నిరాశ
- అధికారుల తీరుపై మండిపడుతున్న జిల్లా వాసులు
- జిల్లాలో 6 వేల మందిపై ప్రభావం



నిర్మల్ ఖిల్లా: ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వడంపై చూపిన శ్రద్ధ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల నిర్వహణపై చూపడం లేదు. అధికారుల వైఫల్యం.. నిరుద్యోగులకు శాపంగా మారుతోంది. ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా గతేడాది అక్టోబర్ 16న నిర్వహించిన గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌ను టీఎస్‌పీఎస్సీ రద్దు చేసింది. తాజాగా రద్దు చేసిన పరీక్షను ఈ ఏడాది జూన్ 11న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించింది. మొదటిసారి జరిగిన పొరపాట్ల నుంచి గుణపాఠం నేర్చుకోని అధికారులు మళ్లీ పరీక్ష నిర్వహణలో విఫలమయ్యారు. దీంతో పరీక్ష నిర్వహణ లోపాలను అదే రోజు అభ్యర్థులు ఎత్తి చూపారు. అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొందరు కోర్టుకు వెళ్లడంతో తాజాగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌ను మళ్లీ రద్దు చేసింది. దీంతో జిల్లా అభ్యర్థులు తీవ్ర నిరాశ చెందారు. అధికారుల తీరు తమకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లాలో 4,489 మంది..

గత జూన్ 11న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షకు జిల్లా నుంచి 4,489 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వీరు కాకుండా నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్ తదితర పరీక్ష కేంద్రాలలో జిల్లాకు చెందిన అభ్యర్థులు మరో 2 వేల మంది వరకు ఉన్నట్లు అంచనా. మొత్తంగా జిల్లాకు చెందిన 6 వేలకుపైగా అబ్యర్థులు గ్రూప్‌–1 ప్రిలిమ్స్ రాశారు. 2023, అక్టోబర్ 16న నిర్వహించిన గ్రూప్‌–1 ప్రిలిమ్స్ పేపర్ లీకేజీ కారణంగా రద్దు చేశారు. అదే పరీక్షను జూన్ 11న మళ్లీ నిర్వహించారు. అయితే పరీక్ష నిర్వహణలో సరైన ప్రామాణాలు పాటించలేదంటూ కొంతమంది అభ్యర్థులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం పరీక్ష రద్దు చేస్తూ శనివారం తీర్పు చెప్పింది. దీంతో ఏళ్లుగా కుటుంబాలకు దూరంగా ఉంటూ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. అభ్యర్థుల ఆవేదన వారి మాటల్లో..

గ్రూప్‌-1 కోసం ఉద్యోగం మానేశా..



ఏడాదిన్నర కాలంగా టీఎస్పీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నా. అంతకుముందు నేను ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేశాను. గ్రూప్స్ పరీక్షల కోసమే ఆ ఉద్యోగం మానేశా. కుటుంబానికి దూరంగా ఉంటూ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. ఇల్లు గడవడం కూడా కష్టంగా ఉంది. అప్పు చేసి పుస్తకాలు కొనుక్కున్న. జూన్ 11న నిర్వహించిన ఈ పరీక్షను బాగా రాశాను. మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్నా. పరీక్ష రద్దు నిర్ణయం షాక్‌కు గురిచేసింది. టీఎస్‌పీఎస్సీ తీరుతో నిరుద్యోగుల బతుకు అగమ్య గోచరంగా తయారైంది.

– రాజశేఖర్, గ్రూప్‌–1 అభ్యర్థి, నిర్మల్

లోపభూయిష్టంగా పరీక్షల నిర్వహణ..



టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ నియామక పరీక్షల నిర్వహణలో విఫలమవుతోంది. లోపభూయిష్టంగా పరీక్షలు నిర్వహిస్తుండడంతోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడుతోంది. గతేడాది రాసిన పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీతో రద్దయింది. ఈ ఏడాది జూన్ 11న నిర్వహించిన పరీక్ష మళ్లీ రద్దు కావడం నిరాశకు గురిచేసింది. రెండుసార్లు పరీక్ష బాగా రాశాను. మూడేళ్ల శ్రమ, డబ్బులు వృథా అయ్యాయి. మానసికంగా సంఘర్షణకు గురవుతున్నాం. చేతగాని వ్యవస్థను రద్దు చేయాలి.

– యెల్మల శ్రీనివాస్, గ్రూప్‌–1 అభ్యర్థి, నిర్మల్

మెయిన్స్‌కు కూడా సిద్ధమవుతున్నా..



ఈ ఏడాది జూన్ 11న నిర్వహించిన గ్రూప్‌–1 ప్రిలిమ్స్ పరీక్ష చాలాబాగా రాశాను. కీ ప్రకారంగా అర్హత సాధిస్తానని నమ్మకం ఉంది. మెయిన్స్‌కు కూడా ప్రిపేర్ అవుతున్నాను. ఎలాగైనా ఉద్యోగం సాధించాలని చాలా కష్టపడుతున్నా. ఈ దశలో పరీక్షను హైకోర్టు రద్దు చేయడంతో నిర్ఘాంతపోయాను. ఇప్పటికే నేను చేస్తున్న ఉద్యోగానికి సెలవు పెట్టి సన్నద్ధమయ్యాను. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి ఇచ్చిన గ్రూప్‌–1 పరీక్ష నిర్వహణలో టీఎస్‌పీఎస్సీ విఫలమవుతోంది. ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలి.

– వంగ సంతోష్‌రెడ్డి, గ్రూప్‌–1 అభ్యర్థి, బీరవెల్లి

నిర్మల్ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు



కేసీఆర్, కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం

నిర్మల్‌టౌన్: నిర్మల్ మున్సిపాలిటీకి రూ.50 కోట్ల టీయూఎస్ఐడీసీ నిధులు మంజూరయ్యాయని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను గతవారం హైదరాబాద్‌లో కలిసి పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. అడిగిన వెంటనే రూ.50 కోట్లు కేటాయించారని తెలిపారు. స్పెషల్ ఫండ్ కింద మరో మూడు రోజుల్లో రూ.25 కోట్లు మంజూరు కానున్నాయన్నారు. ప్రత్యేక నిధులు మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంతో ఊతమిస్తాయని పేర్కొన్నారు. ఈ నిధులతో రూ.9.80 కోట్లతో 42 వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, రూ.5 కోట్లతో నూతన పురపాలక భవన నిర్మాణం, రూ.4 కోట్లతో ఎన్టీఆర్ స్టేడియంలో ఇండోర్ స్టేడియం, మల్టీపర్పస్ హాల్, రూ.2 కోట్లతో ధర్మసాగర్ చెరువు వద్ద మురుగు నీటి శుద్ధీకరణ(1.0 ఎంఎల్డీ – ఎస్‌టీపీ) ప్లాంట్, రూ.3 కోట్లతో ధర్మసాగర్‌–మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి, రూ.1.50 కోట్లతో కట్ట విస్తరణ, రూ.2 కోట్లతో ఇబ్రహీం చెరువు కట్ట విస్తరణ, రూ.2. 50 కోట్లతో పాత తహసీల్దార్ కార్యాలయం వెనుక పార్క్ అభివృద్ధి, ఇతర చెరువుల అభివృద్ధి, ప్రధాన కూడళ్ల అభివృద్ధి, సైక్లింగ్ ట్రాక్, సామాజిక భవనాలు, శ్మశాన వాటికలు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామని వివరించారు. పట్టణంలో జరిగిన అభివృద్ధిని అక్టోబర్ 1 నుంచి ప్రతీ వార్డులో గడపగడపకూ వెళ్లి తెలియజేయాలన్నారు.

కేటీఆర్ పర్యటన వాయిదా

ఈనెల 25న నిర్మల్ జిల్లాలో కేటీఆర్ పర్యటన వర్షాల కారణంగా వాయిదా పడినట్లు మంత్రి ఐకే రెడ్డి తెలిపారు. మళ్లీ అక్టోబర్ మొదటి వారంలో పర్యటన ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాగా, మున్సిపాలిటీకి నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కౌన్సిలర్లు, అధికారులు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, మున్సిపల్ విప్ నేరెళ్ల వేణు, సీనియర్ నాయకుడు డాక్టర్ సుభాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన 13,086 ఉపాధ్యాయ ఖాళీలకు నోటిఫికేషన్ ఇవ్వాలని, ఈమేరకు మెగా డీఎస్సీ నిర్వహించాలని బీఈడీ, డీఈడీ అభ్యర్థులు తిరుమలేశ్, సురేశ్, ఆనంద్ బాబు, మహేశ్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట డీఈడీ, బీఈడీ అభ్యర్థుల సంఘం ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థుల సిలబస్ తగ్గించి పాత సిలబస్ విధానాన్ని కొనసాగించాలన్నారు. పరీక్ష రుసుం రూ.200 గా నిర్ణయించాలన్నారు. ఈ దీక్ష శిబిరాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు సందర్శించి సంఘీభావం తెలిపారు.



డీఎస్సీ అభ్యర్థులకు మద్దతు తెలియజేస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శ్రీహరి రావు

హలో.. గణేశా..

- నవరాత్రులు ఎట్లున్నయ్..
- జ్వరాలు ముసురుకుంటున్నయ్..
- ఎన్నికల వేళ.. నేతల కథేంది..
- గల్లీ గణపతికి కైలాసం నుంచి కాల్



నిర్మల్: గణపతి నవ రాత్రి ఉత్సవాల్లో అప్పుడే సగం రోజులు పూర్తయ్యాయి. దివి నుంచి భువికి వచ్చిన గణనాథుడు ఘనమైన పూజలు అందుకుంటున్నాడు. మరో నాలుగు రోజుల్లో తిరిగి గంగమ్మ ఒడికి చేరనున్నాడు. భక్తుల పూజలతో తన్మయం పొందుతున్న వినాయకుడు అందరినీ ఆశీర్వదిస్తున్నాడు. అయితే శనివారం పూజలందుకుని సేద తీరుతున్న బొజ్జగణపయ్యకు ఓ ఫోన్ వచ్చింది. 'గణనాయకాయ.. గణదైవతాయ.. గణాధ్యక్షయా ధీమహి..' అంటూ సెల్ రింగ్‌టోన్ మోగగానే.. మూషికా.. మళ్లీ రింగ్‌టోన్ మార్చావా..? అంటూ విసుగ్గా అడిగాడు. అప్పటికే గురక పెడుతున్న మూషికుడు చటుక్కున లేచాడు. ఆ..ఆ.. అవును స్వామీ.. నవరాత్రులు కదా రోజుకో పాట పెడదామని.. అంటూ నిద్రమత్తులోనే నసిగాడు. సర్లే.. ఇంతకీ ఫోన్ చేసింది ఎవరు.. అన్నాడు గణేశుడు. వెంటనే మూషికుడు స్వామీ.. కైలాసం నుంచి.. నాకు తెలిసి అమ్మగారే అయుంటారు.. అంటూ గణేశుడికి అందించాడు. కాల్ లిఫ్ట్ చేయగానే.. 'హలో.. గణేశా.. బాగున్నావా పుత్ర..' అంటూ పార్వతీమాత ప్రేమతో పలకరించింది. బాగున్నా అమ్మా.. కైలాసంలో అందరూ బాగున్నారా.. అంటూ తల్లీకొడుకుల కుశల పలకరింపులు కొనసాగాయి. ఆ తర్వాత పరమేశ్వరుడు ఫోన్ తీసుకుని గణేశుడితో మాట్లాడుతూ.. 'హలో గణేశా.. కైలాసమంతా బాగానే ఉంది కానీ.. భూలోకం సంగతేందో చెప్పు. అంతా నిమ్మలమే కదా' అని అడిగాడు. అలా.. తండ్రి అడుగుతూ పోతుంటే.. పార్వతీపుత్రుడు ప్రశాంతంగా జిల్లా ముచ్చట్లు చెబుతూ ఉన్నాడు.

ఆరు రోజులైంది కదా..



గణేశా.. నువ్వు భూలోకం వెళ్లి ఆరు రోజులవుతోంది కదా.. నవరాత్రులు ఎలా సాగుతున్నాయని పరమేశ్వరుడు అడగటంతో.. 'నాన్న.. ఇక్కడంతా ప్రశాంతంగానే ఉంది. ఉదయాన్నే భక్తిపాటలతో నిద్రలేపుతున్నారు. పొద్దున, సాయంత్రం నిత్య పూజలు చేస్తున్నారు. నాకు నచ్చిన ప్రసాదాలనూ పెడుతున్నారు. అంటూ చెప్పాడు వినాయకుడు. సరేకానీ.. నువ్వు వెళ్లినప్పటి నుంచి మళ్లీ వర్షాలు పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఏమైనా ఇబ్బంది ఉందా.. అని శంకరుడు అంటుండగానే.. 'అవును నాన్న.. భారీగానే కురుస్తున్నాయి. కానీ.. ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందిలేదు' అని ఏకదంతుడు సమాధానం ఇచ్చాడు.

డెంగీ, వైరల్ జ్వరాలు..

గణేశా.. అసలు విషయం మర్చిపోయా.. జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయట కదా. జరజాగ్రత్తగా ఉండు మరి. 'అవును నాన్న. జిల్లాలో జ్వరాలతో జనం అల్లాడుతున్నరు. వైరల్‌తోపాటు రెండేళ్లకోసారి డెంగీ విజృంభించడం పరిపాటిగా మారింది. నా మండపాల్లో పూజలకు వచ్చే భక్తులకన్నా.. ఆస్పత్రుల్లోనే జనాలు ఎక్కువగా ఉంటున్నారు..'అని గణేశుడు చెబుతుండగానే.. అవునా.. మరి పాలకులు, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదా..? అని తండ్రి ప్రశ్నించాడు. 'ఈసారి ముందస్తు చర్యలంటూ పెద్దగా ఏం కనిపించడం లేదు నాన్న. అక్కడక్కడాఅవగాహన కల్పిస్తున్నారంతే..' అంటూ పరిస్థితిని గణేశుడు వివరించాడు.

ఎన్నికల సంగతేంది..

ఇవన్నీ సరే గణేశా.. ఇంకొన్ని రోజుల్లోనే ఎన్నికలున్నయ్ కదా.. వాటి ముచ్చట్లేమున్నయ్ మరి. 'నాన్న.. ఈసారి ఎన్నికలు జరంతా ఆసక్తికరంగానే కనిపిస్తున్నాయి. అందరూ గెలిపించు స్వామీ అని.. నన్ను వేడుకుంటున్నారు. నాపేరుతో అన్నదానాలు చేస్తున్నారు. నా విగ్రహాలు కూడా ఇసారి ఉచితంగా నాయకులే పంపిణీ చేశారట. నిమజ్జనానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారని తెలిసింది. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో పోటీ పడుతున్నరు. ఈసారి ఎన్నికలు కూడా పోటా పోటీగా ఉండేటట్లు ఉంది నాన్నా..' అంటూ వినాయకుడు సమకాలీన రాజకీయాలను తండ్రికి వివరించాడు గణనాథుడు.

ఇంతలో..

'ఏమయ్యో.. నా బిడ్డను నిద్రపోనివ్వరా ఇగ. ఇంకెంతసేపు ముచ్చట పెడతారు. నా బొజ్జగణపయ్య మళ్లీ పొద్దున్నే లేసి, భక్తుల పూజలు అందుకోవాలి..'అంటూ పార్వతీమాత పరమేశ్వరుడిపై కాసింత కోపగించుకుంది. దీంతో పార్వతీపతి నవ్వుతూ.. ఫోన్‌లో లౌడ్‌స్పీకర్ ఆన్‌చేశాడు. అప్పుడు ఆ ఆదిదంపతులిద్దరూ మాట్లాడుతూ.. సరే గణేశా.. ఉంటాం మరి. పగటిపూట దోమలు కుట్టకుండా చూసుకో. నీ భక్తులనూ బాగా చూసుకో. అంటూ జాగ్రత్తలు చెప్పారు. 'సరే అమ్మా.. సరే నాన్నా.. నేను బాగానే ఉంటాను. భక్తులనూ బాగా చూసుకుంటాను..'అంటూ ఆవలింతలు తీస్తూ.. గణేశుడు ఫోన్ కట్‌చేసి, మూషికుడి చేతిలో పెడుతూ అలాగే నిద్రపోయాడు.

చట్టపరంగా చెరువు కేటాయింపు

- నిర్మల్ మత్స్య శాఖ ఏడీ నరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

లోకేశ్వరం: చట్టపరంగా ఎవరికి వస్తే వారికి చెరువును కేటాయిస్తామని నిర్మల్ మత్స్య శాఖ ఏడీ నరసింహారావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో కిష్టాపూర్, లోకేశ్వరం గ్రామాలకు చెందిన గూండ్ల(బెస్తా) వారితో కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం సమావేశం నిర్వహించారు. గతంలో లోకేశ్వరం గూండ్ల వారు 30 ఏళ్ల నుంచి కిష్టాపూర్ చెరువులో చేపలు పట్టుకుని జీవిస్తున్నారు. కొన్ని నెలల కిందట లోకేశ్వరంగూండ్ల వారు కిష్టాపూర్ చెరువులో చేపల వేటకు వెళ్లగా కిష్టాపూర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. కిష్టాపూర్ చెరువు విషయమై కలెక్టర్‌కు లోకేశ్వరం గూండ్లవారు ఫిర్యాదు చేశారు. కిష్టాపూర్ గ్రామస్తులు కూడా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇరు గ్రామాల ఫిర్యాదులో లోకేశ్వరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోతీరాం, ఎస్సై సాయికుమార్ సమక్షంలో లోకేశ్వరం, కిష్టాపూర్ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఇరు వర్గాల వాదనలు విన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించి చట్టపరంగా నిర్ణయం తీసుకుంటామన్నారు.

సంప్రదాయాలను గౌరవించుకోవాలి

- జిల్లా జడ్జి కర్ణకుమార్

భైంసాటౌన్: మతాలకు అతీతంగా సంప్రదాయాలను గౌరవించుకోవాలని జిల్లా జడ్జి కర్ణకుమార్ అన్నారు. భైంసా కోర్టు ఆవరణలో న్యాయవాదుల ఆధ్వర్యంలో మొదటిసారి గణేశ్ మండపం ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం నిర్వహించిన హారతి కార్యక్రమంలో జిల్లా జడ్జి పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఇటీవల నిర్వహించిన క్రికెట్‌టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. భైంసా జడ్జి డి.దేవేంద్రబాబు, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఏఎస్పీ కాంతిలాల్ పాల్గొన్నారు.



బహుమతి అందిస్తున్న జడ్జి, ఎమ్మెల్యే, ఏఎస్పీ

పండితులు.. పీఈటీలకు తీపి కబురు

- ప్రమోషన్లకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్
- రెండు రోజుల్లో మార్గదర్శకాలు
- ఉపాధ్యాయుల్లో హర్షం

నిర్మల్ రూరల్: భాషా పండితులు, పీఈటీలకు హైకోర్టు తీపి కబురు అందించిది. ఏళ్ల నిరీక్షణ ఫలించబోతోంది. జీవో 11, 12 అనుసరించి వారికి ప్రమోషన్లను ఇవ్వొచ్చని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం శనివారం తీర్పు ఇచ్చింది. దీంతో పండితులు, పీఈటీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2016 తెలుగు మహాసభల్లో సీఎం కేసీఆర్ పండితులు, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ప్రమోషన్లు ఇస్తామని ప్రకటించారు. దానికి అనుగుణంగా ప్రభుత్వం గతంలో జీవో 11, 12ను విడుదల చేసింది. కానీ కొందరు ఎస్జీటీలు తాము కూడా ప్రమోషన్లకు అర్హులమేనంటూ.. న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రమోషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. హైకోర్టులో వాయిదాల పర్వం కొనసాగుతూ శనివారం పండితులు, పీఈటీలకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ప్రమోషన్లకు ఎస్జీటీలు అర్హులు కారని కేవలం పండిత, పీఈటీలు మాత్రమే అర్హులని స్పష్టం చేసింది.

జిల్లాలో 246 మందికి లబ్ధి..

జిల్లాలో 246 మంది భాషా పండితులు, పీఈటీలు ఎస్జీటీ క్యాడర్ కింద పనిచేస్తున్నారు. పనిచేయడం మాత్రం హైస్కూల్లో జీతభత్యాలు మాత్రం ప్రైమరీ పాఠశాలలో పనిచేసే ఎస్జీటీలతో సమానంగా అందుతోంది. ఈ విషయమై ఎన్నోసార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే పండిత, పోస్టులను అప్‌గ్రేడ్ చేశారు. ప్రమోషన్లు ఇచ్చారు. తమకు కూడా అలాగే ప్రమోషన్లు ఇవ్వాలని మన రాష్ట్రంలో పనిచేస్తున్న భాషా పండితులు, పీఈటీలు ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో ప్రభుత్వం 2021, అక్టోబర్ 5న రాష్ట్రవ్యాప్తంగా 2,487 లాంగ్వేజ్ పండిట్, 1,047 పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ జీవో జారీ చేసింది. కానీ ఎస్జీటీలు కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ నిలిచిపోయింది.

రెండు రోజుల్లో ఉత్తర్వులు..

ఇదిలా ఉండగా జిల్లాలో తెలుగు పండితులు 110, హిందీ– 95, మరాఠీ–02, ఉర్దూ–06 పనిచేస్తుండగా, పీఈటీలు– 33 మంది ఉన్నారు. జిల్లాలో ఎన్ని పోస్టులు వస్తాయో ఇంకా స్పష్టత రాలేదు. కోర్టు తీర్పు శనివారం రావడంతో దానికి అనుగుణంగా పోస్టులను జిల్లాలకు కేటాయించడం, షెడ్యూల్ ప్రకటించడం మరో రెండు రోజులు పట్టొచ్చని విద్యా శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఈ షెడ్యూల్‌లోనే పూర్తి చేయాలి



ఉపాధ్యాయులకు ప్రస్తుతం నడుస్తున్న ప్రమోషన్ల షెడ్యూల్‌లోనే మాకు కూడా అవకాశం కల్పించి ప్ర క్రియను పూర్తి చేయాలి. లేకపోతే మేము జూనియర్లుగా మారే ప్రమాదముంది. చరిత్రాత్మక నిర్ణయం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది.

– జమున, పీఈటీ, ముజిగి

ప్రక్రియ వేగవంతం చేయాలి



ప్రభుత్వం ప్రమోషన్ల ప్రక్రియను వేగవంతంగా చేయాలి. ఆరేళ్ల తర్వాత మాకు అనుకూలంగా తీ ర్పు వచ్చినందుకు సంతో షంగా ఉంది. 2012 డీఎస్సీ అభ్యర్థుల వర కు ప్రమోషన్లు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇచ్చే పదోన్నతి ఆధారపడి ఉంటుంది.

– గంగాధర్, ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

అమ్మవారికి అభిషేకం



అభిషేకం చేస్తున్న వేదపండితులు

భైంసా(ముధోల్): బాసర సరస్వతీ అమ్మవారికి శనివారం వేదమంత్రోచ్ఛరణలతో అభిషేకం చేశారు. ప్రతీ మాసంలో జరిగే సరస్వతి అమ్మవారి జన్మనక్షత్రమైన మూలనక్షత్రం పూజలో భాగంగా వేదపండితులు అభిషేకం, కలశ పూజ, గణపతి పూజ, సరస్వతీ పూజ, కుంకుమార్చన పూజలు చేశారు.

ఏఐసీఎఫ్ అబ్జర్వర్‌గా సదానందం



సదానందం

ఇచ్చోడ(బోథ్): ఆల్‌ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) ఆదిలాబాద్ పార్లమెంట్ అబ్జర్వర్‌గా ఇచ్చోడ మండలానికి చెందిన కె.సదానందంను నియమించినట్లు ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు విజయరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో కమిటీలను వేయనున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల పేదల కు ఈ కమిటీలు అండగా ఉంటాయన్నారు. పేదరిక నిర్మూలన కోసం చేస్తున్న కార్యక్రమానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలతో విద్యార్థులు

భైంసాటౌన్(ముధోల్): రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో భైంసాకు చెందిన మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు యోగేశ్, ముదస్సిర్ ప్రతిభ కనబరిచారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించిన పోటీల్లో 60 కేజీల విభాగంలో యోగేశ్, 80 కేజీల విభాగంలో ముదస్సిర్ కాంస్య పతకం సాధించారు. శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

విత్తన గణపతిం భజే..!

పర్యావరణ హితానికి మట్టి వినాయక ప్రతిమల తయారీ, ఏర్పాటు ఏటేటా పెరుగుతోంది. నిర్మల్ జిల్లాలో మాత్రం మట్టి గణేశ్ ప్రతిమలు నిమజ్జనం చేస్తే కరిగిపోవడమే కాదు మొక్కగా మొలకెత్తనున్నాయి. వివిధ రకాల విత్తనాలతో మట్టి ప్రతిమలు తయారు చేయించి అటవీ సంపద వృద్ధికి నిర్మల్ డీఆర్డీవో విజయలక్ష్మి చేపట్టిన ప్రయోగం సత్ఫలితాల దిశగా సాగుతోంది. విత్తన గణపతులు ఒక్కటే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన నిర్మల్ కొయ్య బొమ్మలకు కీలకమైన ముడి సరుకు పొనికికర్ర.. అలాంటి పొనికికర్ర కొరత ఏర్పడి ఉనికి ప్రశ్నార్థకమవుతున్న తరుణంలో పొనికి కర్ర వనానికి జీవం పోశారు.

– సాక్షి, మంచిర్యాలడెస్క్



ఇటీవల నిర్మల్‌రూరల్ మండలం భాగ్యనగర్‌లో మట్టి వినాయకులు పంపిణీ చేసిన డీఆర్డీవో విజయలక్ష్మి

సండే స్పెషల్



విత్తన గణపతి

- మట్టి వినాయక ప్రతిమల్లో విత్తనాలు
- ఐదు రకాల విత్తనాలతో తయారీ
- నిర్మల్ డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు

మహిళా సంఘాల ఆధ్వర్యంలో..

కొందరు వినాయకులను ఇళ్ల వద్ద నిమజ్జనం చేస్తుండగా, ఎక్కువగా చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తుంటారు. ఎక్కడ నిమజ్జనం చేసినా గణపతి నుంచి మొలక రావాలనే ఉద్దేశంతో పర్యావరణ హిత బీజ గణపతుల తయారీని ఎంచుకున్నారు. భారత ప్రభుత్వం అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువుల పక్కన నడక దారిలో వేప, రావి మొక్కలు నాటాలని సూచిస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రధానంగా ప్రతిమల్లో రావి, మర్రి, వేప విత్తనాలతోపాటు జువ్వి, గంధం, సీతాఫలం విత్తనాలతో చిన్న మట్టి గణపతులు తయారు చేశారు. మట్టి కరిగిన తర్వాత అందులోని విత్తనాలు మొలకెత్తుతాయి. డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా ప్రగతి జిల్లా సమాఖ్య రూరల్ మార్ట్ ద్వారా ఏపీఎంలు 15 నుంచి 20 మంది మూడు వేల ప్రతిమలు తయారు చేశారు. ఈ నెల 17న నిర్మల్ కలెక్టరేట్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పంపిణీ చేశారు. ఒక్కో మండలానికి 200 వరకు అందజేశారు. అక్కడికక్కడే సుమారు వందకు పైగా మంది రూ.100కు ఒకటి చొప్పున కొనుగోలు చేశారు. విత్తన గణపతుల తయారీకి జిల్లా సమాఖ్య నుంచి కొంతమొత్తం రుణంగా పొందారు. ఇలా ప్రతిమల విక్రయాల ద్వారా వచ్చిన డబ్బును రుణం తీర్చడానికి 50 శాతం, తయారీలో పాల్గొన్న ఏపీఎంలు, గ్రామాల్లో పంపిణీ చేసిన వీఓఏల ఖాతాల్లో మిగతా 50 శాతం జమ చేస్తున్నారు.

పొనికివనం..

నిర్మల్ కొయ్యబొమ్మలకు అధిక ధర ఉంటుంది. అందుకు పొనికికర్ర కొరతే కారణమని గ్రహించిన డీఆర్డీవో విజయలక్ష్మి పొనికివనం ఏర్పాటుపై దృష్టి సారించారు. పొనికి మొక్కల కోసం చాలా చోట్ల గాలించారు. మామడ అడవిలో లభించిన పొనికి కర్రను తెచ్చి అంటుగట్టినా ఆశించిన మేరకు ఫలితం రాలేదు. గత సంవత్సరం ఒక్కో నర్సరీలో వెయ్యి చొప్పున పెంచారు. వీటిలో 20 శాతం వరకు బతికాయి. కలెక్టర్ ప్రోత్సాహంతో ఉత్తరాఖండ్ రాష్ట్రం నుంచి ఒక్కో మొక్కను రూ.150 చొప్పున కొనుగోలు చేసి ఐదు వేల మొక్కలు తెప్పించారు. సారంగాపూర్ మండలంలోని ఆరెకరాలు, మామడ మండలంలోని మూడెకరాల అటవీ ప్రాంతంలో పొనికి మొక్కలు నాటారు. కొత్తచిగుర్లు తొడిగి కొమ్మలు వస్తున్నాయి. ఈ పొనికివనంపై అటవీశాఖ ద్వారా సీఎం కేసీఆర్ ఆరా తీసినట్లు తెలిసింది.



పొనికి మొక్క నాటి సెల్ఫీ తీసుకుంటున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి (ఫైల్)

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో గత సంవత్సరం దీపావళికి మట్టి ప్రమిదలు తయారు చేసి విక్రయించారు. కేవలం పది రోజుల్లో రూ.70వేలు వచ్చాయి. జిల్లా మహిళా సమాఖ్య నుంచి తీసుకున్న రుణం తీర్చగా మిగిలిన లాభాన్ని గ్రామాల్లోని వీవోఏలకే అందజేశారు.
- గత సంవత్సరం జూన్‌లో కడెం మండలం మద్దిపడగ గ్రామంలో అంగన్‌వాడీ పిల్లలతో సీడ్ బాల్స్ చేయించారు.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లల కోసం పోషకపాత్ర నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతోపాటు అదనంగా పోషక పాత్ర అమలు చేస్తున్నారు. పిల్లలు ఇంటికి వెళ్లిన తర్వాత రోజుకో తీరున స్థానికంగా లభించే చేపలు, చికెన్, ఆకు కూరలు అందిస్తున్నారు. ఏదీ లేని రోజు పాత్ర నిండా పాలు తాగేలా వీఓఏలు అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు.
- తెలంగాణలో మొదటిసారిగా కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు మధ్యలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గోబర్‌గ్యాస్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఊహించిన దానికంటే ఎక్కువగా గ్యాస్ వస్తోంది. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో వంటలకు సరిపోతోంది.
- ఒకే రోజు 5,940 ఇంకుడు గుంతలు నిర్మించారు. ఒకేసారి నిర్మాణం చేపట్టి రికార్డు సృష్టించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతల వల్ల నీరు ఇంకి బురదగా మారడం తగ్గింది. వీటివల్ల భూగర్భజలాలు వృద్ధి చెందినట్లు తెలుస్తోంది.

రెండు నెలలకో ఇన్నోవేషన్



నిర్మల్ జిల్లాలో బాధ్యతలు చేపట్టి ఏడాది పది నెలలు కావొస్తోంది. మట్టి గణపతుల తయారీ, ఆపరేషన్ సంకల్ప, కిచెన్‌గార్డెన్, పౌష్టిక పాత్ర, పొనికి వనం ఇలా దాదాపు రెండు నెలలకో ఇన్నోవేషన్ తీసుకొచ్చాం. గత దసరాకు మట్టి ప్రమిదలు తయారు చేయించి విక్రయించాం. 'మన అంగన్‌వాడీ–మన ఆకు కూరలు' అనే నినాదంతో ప్రతీ గ్రామంలో కిచెన్‌గార్డెన్ నిర్వహిస్తున్నాం. ప్రతీ ఇంటికి కిచెన్ గార్డెన్, గ్రామంలో కమ్యూనిటీ కిచెన్ గార్డెన్ ఉన్నాయి. మునగాకు, కారప్పొడి తయారీపై ముధోల్‌లో మహిళా సమాఖ్యకు శిక్షణ ఇప్పించాం. అడవిలో పెరిగే రేలా విత్తనాలు కూడా వేశాం. ఇంటిగ్రేటెడ్‌ఫార్మింగ్‌పై దృష్టి సారించాం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్

'అంగన్‌వాడీల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించాలి'

ఇంద్రవెల్లి(ఖానాపూర్): అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలని కోరుతూ కేస్లాపూర్ నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ శనివారం ఢిల్లీలో ఎంపీ సోయం బాపురావ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటాన్ని దేశవ్యాప్తంగా తెలిసేలా పార్లమెంట్‌లో ప్రస్తావించి వారికి న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆదివాసీ సంఘాల నాయకులు మెస్రం చిన్నుపటేల్, రఘురాం, బారిక్‌రావ్, పాండు, అమృత్‌రావ్, జుగాదిరావ్, గణేశ్, తదితరులు ఉన్నారు.



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న వెంకట్‌రావ్

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో శనివారం వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.

పురుగుల మందుతాగి మహిళ

బేల(ఆదిలాబాద్): పురుగుల మందుతాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాధిక తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మణియార్‌పూర్‌కు చెందిన మేస్రం లత(40)కు ఇరవైఏళ్ల క్రితం మహారాష్ట్రకు చెందిన వ్యక్తితో వివాహమైంది. దంపతుల మధ్య గొడవలు తలెత్తడంతో పదేళ్లక్రితం మణియార్‌పూర్‌లోని పుట్టింటికి వచ్చేసింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా పలు ఆస్పత్రుల్లో చూపించినా వ్యాధి నయంకాలేదు. శనివారం మధ్యాహ్నం ఇంటివద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి దాదారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అదనపు కట్నం వేధింపులతో ఒకరు

కడెం: అదనపు కట్నం వేధింపులతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కె.రాజు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మొలిగే నర్సవ్వ కూతురు లావణ్య(28) ఎనిమిదేళ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఇందూరి నరేశ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. కొన్నిరోజులుగా అదనపు కట్నం తేవాలని భర్తతో పాటుగా అత్త, ఆడపడుచు వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో మనస్తాపం చెంది శనివారం ఇంట్లో సూపర్ వాస్మోల్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా ఖానాపూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు భర్త నరేశ్, అత్త లచ్చవ్వ, ఆడపడుచు సరితపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

బేల(ఆదిలాబాద్): మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పాటన్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాధిక తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సోయం విశాల్ (35) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం ఇంటికి వచ్చి భార్య గీతతో గొడవ పడేవాడు. రెండు రోజుల క్రితం గీతను ఆమె సోదరుడు పుట్టింటికి తీసుకెళ్లాడు. శుక్రవారం ఇంటివద్ద మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం మృతుని తండ్రి సోయం రాందాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం



యోగేశ్ (ఫైల్)

ఖానాపూర్: ఈ నెల 15న అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. సూర్జాపూర్ గ్రామానికి చెందిన గందె యోగేశ్ (28) ఈ నెల 15న ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో అతని తండ్రి సాంబయ్య 16న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా శనివారం బాదన్‌కుర్తి సమీపంలోని గోదావరిలో మృతదేహం కనిపించడంతో చేపలవేటకు వెళ్లిన జాలర్లు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు యోగేశ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, జీవితంపై విరక్తి చెంది గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీస్ స్టేషన్‌పై దాడిచేసిన పలువురిపై కేసు

ఖానాపూర్: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌పై శుక్రవారం రాత్రి మూకుమ్మడిగా దాడిచేసి అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వారిపై పలు సెక్షన్‌లలో కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్, ఎస్సై లింబాద్రి తెలిపారు. కార్యాలయంపై రాళ్లతో దాడిచేయడమే కాకుండా తలుపు రెక్కను, కిటికీ అద్దాలు, పూలకుండీలు, వాటర్ బాటిళ్లను పగులగొట్టిన ఘటనలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌తో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

బాబాపూర్‌లో చోరీ

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని బాబాపూర్‌లో చోరీ జరిగినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గ్రామానికి చెందిన హలీమ బేగం శుక్రవారం నిర్మల్ రూరల్ మండలంలోని ముతాపూర్‌లో ఉన్న తన తమ్ముడి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలో దాచి ఉంచిన రూ.75 వేల నగదు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి గురైన బైక్ పట్టివేత

నిర్మల్‌టౌన్: ఆర్నెళ్లక్రితం చోరీకి గురైన ప్యాషన్ ప్రో బైక్‌ను శనివారం పట్టుకున్నట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన సిద్దిఖీ బైక్‌ను ఎన్టీఆర్ మినీ స్టేడియంలో దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసుల తనిఖీలో సదరు బైక్‌ను ఆపి ధ్రువీకరణ పత్రాలు అడుగగా బైక్ నడుపుతున్న వ్యక్తి తడబడడంతో అనుమానం వచ్చి ప్రశ్నించగా దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. థర్డ్ ఐలో ఎంట్రీ చేసి బైక్ యజమాని ఫోన్‌నంబర్ కనుగొన్నారు. అతనికి ఫోన్ చేయడంతో ఒరిజినల్ పత్రాలు తీసుకురావడంతో వాటిని పరిశీలించి బైక్ అప్పగించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గుడిహత్నూర్: మన్నూర్ సమీపంలో ఉన్న రాణి జిన్నింగ్ మిల్లు పరిసర ప్రాంతంలో శనివారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.25,800 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన ఆదిలాబాద్ జట్టు

- అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్: క్రీడాకారులు నిరంతరం క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఆదిలాబాద్ అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న అండర్–17 బాలికల ఉమ్మడి జిల్లా క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని 11 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, అథ్లెటిక్స్, క్యారం, చెస్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా ఆదిలాబాద్ బాలికలు నిలవగా, వ్యక్తిగత విభాగంలో చాంపియన్‌గా ఆదిలాబాద్ పాఠశాలకు చెందిన అంకిత నిలిచింది. విజేతలకు అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్సీవో గోపీచంద్, బీసీ శాఖ అధికారి రాజలింగు, ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసర్ పార్థసారథి, ప్రిన్సిపాల్ విద్య, కౌన్సిలర్ పవన్ నాయక్, పెటా ప్రధాన కార్యదర్శి స్వామి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, ఉపాధ్యాయులు రాజేశ్, సత్యనారాయణగౌడ్, జయశ్రీ, శ్రీలత, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

30లోగా పనులు పూర్తి చేయాలి

కడెం: పునరావాస కాలనీ పనులను ఈ నెల 30లోగా పూర్తి చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని కొత్తమద్దిపడగ సమీపంలో రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులకు ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీ పనులను ఎఫ్‌డీపీటీ వినోద్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం రెవెన్యూ, విద్యుత్, ఐటీడీఏ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు, వ్యవసాయ భూమి, డ్రైయినేజీలు, సీసీరోడ్లు, విద్యుత్ సరాఫరా, నీటి సరఫరా పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో రాంకిషన్, ఎఫ్‌డీవో భవానీశంకర్, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎఫ్ఆర్వో అనిత, ఏడీఏ శ్రీనివాస్, ఏఈఈ సుమన్‌కుమార్, మిషన్ భగీరథ డీఈ హరీశ్, ఏఈ లవకుమార్, సర్పంచ్ రాజమణి, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

ఖానాపూర్ సీఐ, ఎస్సైపై ఫిర్యాదు

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్

నిర్మల్‌చైన్‌గేట్: ఖానాపూర్ సీఐ, ఎస్సైపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మండలంలోని రాజులకు చెందిన గడ్డం రవీందర్ శనివారం నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డికి వినతిపత్రం అందజేసి ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్‌కు సమస్య వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను బీఆర్ఎస్‌లో చేరడం లేదన్న కారణంగా శుక్రవారం రాత్రి ఆపార్టీ నాయకులైన జాన్సన్ నాయక్, అతని అనుచరులు తనతో గొడవపెట్టుకున్నారన్నారు. ఈ విషయంపై మాట్లాడుతుండగానే సీఐ మోహన్, ఎస్సై ఏకపక్షంగా దాడికి పాల్పడ్డారన్నారు.

చట్టాన్ని అగౌరవపర్చడమే..

మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు రాథోడ్ రమేశ్ మాట్లాడుతూ జాన్సన్ అనే వ్యక్తికి ఖానాపూర్‌తో సంబంధం ఏమిటని ప్రశ్నించారు. జాన్సన్ నాయక్ అనే వ్యక్తి బీఆర్ఎస్ తరఫున నామినేషన్ వేయకుండా, బీఫాం తీసుకోకున్నా పోలీసులు అతనికి భద్రత కల్పించడం చట్టాన్ని అగౌరవ పరచడమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు అయ్యన్న గారి భూమయ్య, పెంబి జెడ్పీటీసీ జానుబాయి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ పాల్గొన్నారు.



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదర్శ పల్లెలకు.. అవార్డులు

- ఐదు అవార్డులు అందుకున్న ఖథ్‌గాం పంచాయతీ
- ఐకమత్యంతో అన్నింటా ముందు..
- స్వచ్ఛసర్వేక్షణ్‌కు జిల్లాలో 15 జీపీలు ఎంపిక


ఖథ్‌గాం గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన మొక్కలు


ఖథ్‌గాం గ్రామ ముఖచిత్రం

గ్రామాల్లో వసతులు మెరుగుపడుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన అంశాలను సాధిస్తూ గ్రామపంచాయతీలు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాయి. అన్ని రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించిన గ్రామపంచాయతీలను ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్–2023 ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి పురస్కారాలకు ఎంపిక చేసింది. ఈ ఏడాది జిల్లా స్థాయిలో 15 గ్రామపంచాయతీలు స్వచ్ఛసర్వేక్షన్ గ్రామీణ పురస్కారాలను అందుకున్నాయి.

– భైంసారూరల్/మామడ:

భైంసా మండలంలో..
భైంసా మండలంలోని ఖథ్‌గాం పంచాయతీ ఐదేళ్లలోనే ఐదు అవార్డులు అందుకుంది. నూతన పంచాయతీగా ఏర్పడిన ఖథ్‌గాం అభివృద్ధిలో ప్రత్యేక ముద్ర సొంతం చేసుకుంది. 2020 జనవరి 26న ఉత్తమ కార్యదర్శిగా, 2021 నవంబర్ 13న ఉత్తమ సర్పంచుగా, 2023 జనవరి 5న ఉత్తమ పంచాయతీగా, 2023 ఆగస్టు 15న ఉత్తమ పంచాయతీగా, 2023 సెప్టెంబర్ 17న ఉత్తమ పంచాయతీగా ఎన్నికై రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి అవార్డులను అందజేశారు.

అధిక జనాభా ఉన్న గ్రామంగా..
మామడ మండలంలోని పొన్కల్‌లో 5160 మంది జనాభా ఉండగా ఇందులో 2505 పురుషులు, 2655 స్త్రీలు ఉన్నారు. అధిక జనాభా కలిగిన గ్రామ పంచాయతీ విభాగంలో స్వచ్ఛసర్వేక్షణ్ పురస్కారానికి ఎంపికైంది. 1700 వందలకు పైగా కుటుంబాలు ఉన్నాయి. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డిని నిర్మించారు.

జిల్లాలో ఎంపికైన గ్రామాలు..
జిల్లా స్థాయిలో 15 గ్రామ పంచాయితీలను ఎంపిక చేశారు. భైంసా మండలంలోని ఖాథేగాం, దిలావార్‌పూర్ మండలంలో దిలావార్‌పూర్, గుండంపల్లి, బన్సపల్లి, సిర్గాపూర్, కడెం మండలంలోని కన్నాపూర్, నచ్చన్‌ఎల్లాపూర్, ఖానాపూర్ మండలంలోని బదన్‌కుర్తి, బావాపూర్(కె), లక్ష్మణచాంద మండలంలోని లక్ష్మణచాంద, నిర్మల్ మండలంలోని రత్నాపూర్‌కాండ్లి, సారంగపూర్ మండలంలోని జాం, నర్సాపూర్(జి) మండలంలోని నర్సాపూర్(జి) ,మామడ మండలంలోని పొన్కల్, ముధోల్ మండలంలో ముధోల్ గ్రామపంచాయతీలకు పురస్కారాలను అందచేశారు.


మామడ: పొన్కల్ గ్రామానికి అవార్డు అందిస్తున్న మంత్రి ఐకేరెడ్డి(ఫైల్)

అందరి సహకారంతో


అందరి సహకారంతో ఖథ్‌గాం గ్రామం అన్ని విధాలా అభివృద్ధి సాధించింది. గ్రామంలో యువకులు, ప్రజలు, పంచాయతీ సిబ్బంది అంతా సహకరించారు. ఖథ్‌గాం గ్రామం అన్నింటా ముందువరుసలో ఉంది. ఐదు అవార్డులు దక్కడం ఎంతో గర్వంగా భావిస్తున్నాం.

–దెగ్లూర్ రాజు, సర్పంచ్, ఖథ్‌గాం

నిర్దేశించిన అంశాలను అమలు చేశాం


ప్రభుత్వం నిర్దేశించిన అంశాలను గ్రామంలో అమలు చేశాం. దీంతో చాలా వరకు వసతులు మెరుగుపడ్డాయి. సెగ్రిగేషన్ షెడ్, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం, ఇంకుడుగుంతల నిర్మాణంతో మెరుగైన ఫలితాలు వచ్చాయి. స్వచ్ఛసర్వేక్షణ్ పురస్కారం రావడంతో గుర్తింపు లభించింది.

– సాయికృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, పొన్కల్

సంతోషంగా ఉంది


మా గ్రామపంచాయతీకి స్వచ్ఛ సర్వేక్షణ్ రావడం చాలా సంతోషంగా ఉంది. పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. గ్రామంలో డ్రైయినేజీల నిర్మాణం చేపట్టాం. పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకున్నాం.

– భూమేశ్వర్, సర్పంచ్, పొన్కల్

జీపీ భవనం పూర్తయింది..


ఖథ్‌గాంలో ఇప్పటికే పంచాయతీ భవన నిర్మాణం పూర్తయింది. ఇటీవలే కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కొత్తగా ఏర్పడిన మా పంచాయతీకి పలు అవార్డులు దక్కాయి. అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పరుస్తున్నాం.


–ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి, ఖథ్‌గాం

కరాటే ధర్మరాజ్ మృతి


చుక్క ధర్మరాజు(ఫైల్)

నిర్మల్: కరాటే ధర్మరాజ్‌గా కొన్ని దశాబ్దాలుగా వేలమంది విద్యార్థులను తీర్చిదిద్దిన జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు చుక్క ధర్మరాజ్(60) మృతిచెందారు. జిల్లాకేంద్రంలోని వెంకటాద్రిపేట్(ప్రియదర్శినినగర్)కు చెందిన ధర్మరాజ్ కొన్నినెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇదేక్రమంలో శనివారం తన నివాసంలోనే గుండెపోటు రావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. చిన్నతనం నుంచే కరాటేపై ఆసక్తితో నేర్చుకుని అంచెలంచెలుగా అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. ఆయన అకాల మృతిపై పలువురు సంతాపం వ్యక్తంచేశారు.

మట్టి గణేశుడికే జై..


లోకమాన్య గణేశ్ మండలి ఆధ్వర్యంలోని మట్టిగణపతి

నిర్మల్‌టౌన్: ఇంట్లో పూజలందుకుంటున్న చిన్నచిన్న విగ్నేశ్వరుడితో పాటు, గల్లీలో కొలువుదీరిన భారీ గణేష్ కూడా ఈసారి మట్టితోనే ప్రతిష్టాపించారు. పట్టణంలోని ఎన్టీఆర్ మార్గ్ రోడ్‌నెం.5లో లోకమాన్య గణేష్ మండలి ఆధ్వర్యంలో కొలువుదీరిన 42వ నంబర్ గణపతిని 11 ఏళ్ల నుంచి సహజ సిద్ధ రంగులతో అద్దుకున్న మట్టి గణపతినే పూజిస్తున్నారు. నిర్మల్‌లోనే మొట్టమొదటిసారిగా మట్టితో చేసిన భారీ వినాయకుడిని తీసుకొచ్చింది వీరే. ఈ వినాయకుడి వద్దకు పట్టణంలోని పలుకాలనీల భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహిస్తారు. ఈ సంవత్సరం సుమారు 20 నుంచి 30 మట్టి గణపతులను ప్రతిష్టాపించారు. మండప నిర్వాహకులైన జులా రామక్రిష్ణ, రాజ్ నిఖిల్, హరీష్, అభినయ్ మిగతా మండల సభ్యులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

క్లుప్తంగా

ముగిసిన ప్రజావేదిక


మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం వైస్ ఎంపీపీ మ్యాదరి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన రెండవ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో డిసెంబర్ 2021 నుంచి మార్చి 2023 వరకు చేపట్టిన రూ.4కోట్ల 80 లక్షల 40 వేల 784 సంబంధించిన పనులను ఎస్ఆర్పీ రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందాలు (బీఆర్పీలు) వారం రోజులుగా పరిశీలించి తుది నివేదికను డీఆర్డీఓ విజయ లక్ష్మి ముందు ఉంచారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీడీవో అల్లాడి వనజ, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్, అంబుడ్స్‌మన్ పి.నవీన్, ఏబీవో లక్ష్మయ్య, టీఏలు రవీందర్, సతీష్ ఉన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీ
దస్తురాబాద్: ఉపాధి హామీ సామాజిక తనిఖీ కొనసాగుతోంది. శనివారం మండలంలోని మున్యాలతండా, భూత్కూర్, దేవునిగూడెం, పేర్కపల్లే గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా 2022లో ఉపాదిహామీ ద్వారా చేపట్టిన పనుల వివరాలను గ్రామసభలో వివరారించారు. ఈ నెల 26న ప్రజావేదిక నిర్వహించనున్నట్లు మండల ఎంపీడీవో విజయ్‌భాస్కర్ రెడ్డి తెలిపారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం


వడ్‌గాంలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

తానూరు: మండలంలోని కోలూరు, సింగన్‌గాం, ఖర్బాలా, ఎల్వత్, వాడవన గ్రామాల్లో శనివారం గణేశ్ నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గణనాథునికి గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. కోఆప్షన్ సభ్యుడు గోవింద్‌పటేల్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వినాయక నిమజ్జన శోభాయాత్రలు శనివారం కన్నుల పండువగా సాగాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బుక్య జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో ప్రతిష్ఠించిన వినాయక మండపంలో ప్రత్యేక పూజల అనంతరం శోభాయాత్రను కళాకారుల నృత్యాల మధ్య అత్యంత వైభవోపేతంగా సాగింది.

వడ్డెరులను పట్టించుకోవాలి

నిర్మల్‌ఖిల్లా: వడ్డెర కులవృత్తిని కొనసాగిస్తున్న వారు తీవ్ర నిరాదరణకు గురవుతున్నారని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో లక్ష్మణచాంద మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాతి క్వారీలన్నీ రాళ్లుకొట్టుకొని జీవనం కొనసాగించే వడ్డెర సామాజిక వర్గానికి చెందకుండా అగ్ర వర్ణాల చేతుల్లోకి వెళ్లాయని అన్నారు. ప్రభుత్వం వడ్డెరబంధు ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మక్కల నాగన్న, ఉపాధ్యక్షుడు అలకుంట శ్రీనివాస్, నాయకులు పల్లపు రవీందర్, దండుగుల రాజు, పోశెట్టి పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ


పోటీల్లో పాల్గొన్న భజన బృందాలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానంలో శనివారం శ్రీవెంకటేశ్వర స్వామివారి పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి అలివేలు మంగ, వేంకటేశ్వరస్వామికి పంచమతాభిషేకం, వివిధ పూజ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్ పాల్గొన్నారు.

దేవరకోటలో భజన పోటీలు ..
జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానంలో నిర్మల్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శనివారం గణేష్ నవరాత్రుల సందర్భంగా భజన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణీతగా కట్ట నాగబాలి, గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి దోనగిరి మురళి, ఉపాధ్యక్షుడు సల్ల కిషన్, పతికే రమేష్, కోనేటి ఆనంద్, ఎల్లుల్ల అనిల్ పాల్గొన్నారు.

కర్ర గణపతికి పూజలు

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో మోక్ష కర్ర గణపతికి శనివారం మాజీ జెడ్పీ చెర్మన్ లోలం శ్యాంసుందర్ పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పీఏసీఎస్ చెర్మన్ రత్నాకర్‌రావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భుజంగ్‌రావు, సర్పంచ్ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి ఉన్నారు.

‘కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తాం’


సమావేశంలో కేశవ్‌దాస్, తదితరులు

భైంసాటౌన్: ఎస్‌బీఐ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం కృషి చేస్తామని ఎస్‌బీఐ యూనియన్ జాతీయ గౌరవాధ్యక్షుడు, భైంసాకు చెందిన న్యాయవాది కేశవ్‌దాస్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య కళాభవన్‌లో జరిగిన ఎస్‌బీఐ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ జాతీయ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, ఎంవి గుణేశ్వరరావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి నరసింహ ఉన్నారు.

పందుల పెంపకానికి స్థలం కేటాయించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలో తరతరాలుగా పందుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న ఎరుకల కులస్తుల పందుల డెయిరీఫాం కోసం ఐదెకరాల ప్రభుత్వ ఖాళీ స్థలం కేటాయించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ పరిమల్ బౌమిక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జెట్టి రాజేశ్వర్, లోకిని రాము మాట్లాడారు. తమకు ఎటువంటి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో కులవృత్తిగా పందుల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల పోలీసు, మున్సిపల్‌శాఖ అధికారులు పట్టణంలో పందులను ఉంచవద్దని విచక్షణరహితంగా దాడులు చేస్తూ మాపై అక్రమ కేసులు నమోదు చేయడంతో కోర్టుల చుట్టు తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు ప్రభుత్వం నుంచి 5 ఎకరాల భూమి ఇస్తే సామూహికంగా పందుల పెంపకం కోసం డెయిరీ ఏర్పాటు చేసుకుని జీవిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గరక చిన్నయ్య, జెట్టి శ్రీనివాస్, తదితరులున్నారు.

మోదీ పథకాలను ఇంటింటికీ చేరవేయడమే లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి


మహిళలతో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: ప్రధాని మోదీ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లడమే లక్ష్యమని నిర్మల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఇంటింటికీ –బీజేపీ,గడప గడపకు –బీజేపీ అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ), బాబాపూర్, న్యూ కంజర్, లక్ష్మణచాంద గ్రామాల్లో గడపగడపకూ పర్యటించి భారత ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్నటువంటి అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు, పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. మా ప్రభుత్వం రాగానే స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేసిన కబ్జా భూములను స్వాధీనం చేసుకొని అర్హులైన పేద ప్రజలకు పంచుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోవర్ధన్, బీజేపి సీనియర్ నాయకులు అయ్యన్న గారి భూమయ్య, రావు రాంనాథ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, తక్కల రమణారెడ్డి, భూపతిరెడ్డి, గాదె విలాస్, హరీశ్‌రెడ్డి, మార గంగారెడ్డి ఉన్నారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్


వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మామడ: మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం నోబ్యాగ్‌డే సందర్భంగా ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. విద్యార్థులు ఆసక్తిగా ఈ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. తెలంగాణ ప్రత్యేక వంటకాలైన సర్వపిండి, నువ్వుల లడ్డూలు, మొక్కజొన్న వడలు వంటి వంటకాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు

కుభీర్: అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని మండల ఉపాధ్యక్షుడు మోహినోద్దిన్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు మైనార్టీ యువకులకు రెచ్చగొట్టి మైనార్టీ బంధు నాబంధువులకే ఇప్పించానని మండల బస్టాండ్ ఎదుట ధర్నా చేయించడం తగదన్నారు. నాపై చేసిన ఆరోపనలు రుజువు చేయాలని లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట మైనార్టీ నాయకులు రహూఫ్, షాహిద్, సలీం, రహుఫ్ ఉన్నారు.

మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో నిర్మించనున్న ఆయిల్‌ఫాం కార్మాగారానికి భూమిపూజ చేసేందుకు ఈనెల 25 రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వస్తున్న నేపథ్యంలో శనివారం అదనపు పాలనాధికారి కిశోర్‌కుమార్ పనులను పరిశీలించారు. వివిధ శాఖల సిబ్బందికి పలు సూచనలు చేశారు. జరుగుతున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల ప్రత్యేక అధికారి జెడ్పీసీఈవో సుధీర్ కుమార్, ఎంపీడీవో మోహన్‌రెడ్డి ఉన్నారు.

పార్టీ పటిష్టతకు సైనికుల్లా పనిచేయాలి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

లక్ష్మణచాంద: పార్టీ పటిష్టతకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని తిర్పెల్లి గ్రామానికి చెందిన 50 మంది యువకులు, నాయకులు క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీజేపి పార్టీని వీడీ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి ఐకేరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌లో చేరడం అభినందనీయమన్నారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రమేష్ ఉన్నారు.

మంత్రిని కలిసిన మాచాపూర్ గ్రామస్తులు
లక్ష్మణచాంద మండలంలోని మల్లాపూర్ అనుబంధ గ్రామమైన మాచాపూర్ గ్రామస్తులు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.

పండుగలు భారతీయ సంస్కృతిలో భాగం


బహుమతులు అందిస్తున్న ఏఎస్పీ, సభ్యులు

భైంసాటౌన్: పండుగలు భారతీయ సంస్కృతిలో భాగమని భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ అన్నారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా హిందూ ఉత్సవ సమితి సంస్కృతి విభాగం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు పలు అంశాల్లో ప్రతిభా పోటీలు నిర్వహించారు. పట్టణంలోని నర్సింహా కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి ఏఎస్పీ హాజరై మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు విలాస్ గాదేవార్, డాక్టర్ రామకృష్ణ గౌడ్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు అరవింద్, ఉత్సవ సమితి సభ్యులు డాక్టర్ నాగేష్, గోపాల్ కిషన్, మహారాజ్, వెంకటేష్, శ్యామ్ సుందర్ మందాని ఉన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించండి


విద్యుత్ కట్ చేస్తున్న విద్యుత్ ఏఈ

లోకేశ్వరం: పెండింగ్‌లోని గృహావసర బిల్లులు, వ్యవసాయ మోటార్ సర్‌చార్జీలను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేస్తామని విద్యుత్ ఏఈ శివకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గృహావసరాలకు వినియోగించే విద్యుత్ మీటర్లను ఆయన పరిశీలించారు. విద్యుత్ బిల్లులు చెల్లించాలని వారి ఇంటికి విద్యుత్ సరఫరా కట్ చేయించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ మాట్లాడుతూ ప్రతీ విద్యుత్ వినియోగదారుడు పెండింగ్ బిల్లులను చెల్లించాలని సూచించారు. విద్యుత్ సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకురావలన్నారు. ఆయన వెంట విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

మాజీ ఎంపీ రమేశ్‌పై ఫిర్యాదు
ఖానాపూర్: రాజూరా గ్రామంలో చోటుచేసుకున్న గొడవపై మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ వ్యాఖ్యలు సరికాదని దళిత, గిరిజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం మహిళల ఆత్మ గౌరవం దెబ్బతినేలా మాట్లాడడం హేయమైన చర్య అన్నారు. అనంతరం అతడిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజగంగన్న, ద్యావతి రాజేశ్వర్, మునుగూరి ప్రణీత్, నేత శ్యామ్, సిద్ధార్థ్ నాయక్, గొర్రె గంగాధర్, బొమ్మెన రాకేశ్ ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ
లక్ష్మణచాంద: విద్యార్థులు తయారు చేసిన కరపత్రాలను మండలంలోని పార్‌పెల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మోహన్ ఆవిష్కరించారు. తెలుగు ఉపాధ్యాయుడు నాగయ్య కుర్మే పర్యావరణ పరిరక్షణ -మన అందరి బాధ్యత అనే అంశంపై 9వ తరగతి విద్యార్థులతో వ్యాసం రాయించి కరపత్రంగా తయారు చేయించారు.

బీఎల్‌వోల సమస్యలు తీర్చాలి..
పెంబి: బీఎల్‌వోలుగా 18ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న పారితోషికం ఇవ్వడం లేదని తహసీల్దార్ లక్ష్మణ్‌కు విన్నవించారు. డిప్యూటీ తహసీల్దార్ లచ్చిరాం, ఆర్ఐ రాజం ఉన్నారు.

కడెం: బీఎల్‌వోలకు పారితోషికం ఇప్పించాలని తహసీల్దార్ రాజేశ్వరికి బీఎల్‌వోలు వినతిపత్రం అందజేశారు. ఇందులో బీఎల్‌వోలు రాజేశ్వరి, భూపేందర్, లక్ష్మి, కరుణ ఉన్నారు.

మంత్రి పరామర్శ
సారంగపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు లక్కడి సాగర్‌రెడ్డి సోదరుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. నిర్మల్, సారంగపూర్ ఎంపీపీలు రామేశ్వర్‌రెడ్డి, అట్ల మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు.

నేడు సామాన్యుడి సమరభేరి సభ
నిర్మల్‌చైన్‌గేట్: ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24న హైదరాబాద్‌లో నిర్వహించే సామాన్యుడి సమరభేరి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ కోరారు.

రక్తహీనతను అరికట్టాలి
ఖానాపూర్: రక్తహీనత లోపించకుండా అధికారులు, సిబ్బంది సూచనమేరకు గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు పోషకాహారం తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని సుభాశ్‌నగర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అనిమియాసే ముక్త్ కార్యక్రమంలో మాట్లాడారు. ఇందులో అధికారులు, సిబ్బంది నిర్మల, శ్యామల, రాధ, శాహినాజ్, మీరా, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నివారణకు కృషిచేయాలి..
కుంటాల: సంపూర్ణ పారిశుధ్యానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని స్వచ్ఛభారత్ మిషన్ కన్సల్టెంట్ అబూజర్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఎంపీవో రహీం పాల్గొన్నారు.

క్షమాపణలు చెప్పాలి
ఖానాపూర్: ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఏపీ, తెలంగాణ ఆదివాసీ సభల్లో లంబాడాలను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెడ్మ బొజ్జు లంబాడాలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని గిరిజన శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్దార్థ్ నాయక్ డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాస్, వసంత్, రవీందర్ ఉన్నారు.

సోయా పంట పరిశీలన


తానూరు: మండలంలోని దాగాంలో శనివారం సోయా పంటలను వ్యవసాయ పరిశోధన స్థానం ఆదిలాబాద్, ముధోల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేందర్‌రెడ్డి, రఘువీర్, విజయ్‌లు పంటను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారి పవన్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: కురన్నపేట్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ రవి శనివారం తెలిపారు. కురాన్నపేట్, షేక్ సాహెబ్ పెట్, వెంకటాద్రిపేట్, కాల్వగడ్డ, గుల్జార్ మార్కెట్, బాలాజీ వాడ, బ్రహ్మపురి ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.